క్లుప్తంగా

ఖిల్లా రామాలయం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖిల్లా రామాలయం వద్ద ఆలయ కమిటీ, మజీద్ కమిటీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఏఎస్సై రమేష్ తెలిపారు. ఇక్కడ అల్లరిమూకలు గొడవలకు దిగడంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించినట్లు చెప్పారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో రైలులో రెండు ఫోన్‌లు శుక్రవారం పోగొట్టుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడంతో రెండు ఫోన్లను స్వాధీనం చేసుకొని బాధితులకు ఇచ్చామన్నారు. నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోతే వెంటనే స్థానికంగా ఉన్న మీసేవా కేంద్రాలలో సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేస్తే సెల్‌ఫోన్ అందిస్తామన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్యమేళా



ధర్పల్లి: ధర్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో శనివారం ఆరోగ్య మేళా నిర్వహించారు. రక్త పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఇంకా ఎక్కువ ఇబ్బంది ఉంటే జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి వచ్చి చూయించుకోవాలని సూచించారు. స్థానిక వైద్యులు మౌనిక, స్త్రీ వైద్య నిపుణులు రమ్య, శస్త్ర చికిత్స నిపుణులు నిఖిత, నర్సింగ్ ఆఫీసర్ అరుణ, లత, మేరీ, కృష్ణ, జయ, వాజిద్, సంతోష్, మురళి పాల్గొన్నారు.

సారంగపూర్ ఆలయాన్ని దర్శించుకున్న మేయర్



నిజామాబాద్ రూరల్: శ్రావణ మాసం పురస్కరించుకుని నగర మేయర్ దండు నీతూ కిరణ్ మండలంలోని సారంగపూర్ హనుమాన్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణ మాసంలో సారంగాపూర్ హనుమాన్ ఆలయ సందర్శన కోసం ఇతర జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల భక్తులు కూడా వస్తుంటారు.

కేంద్రమంత్రి బండి సంజయ్‌కు సన్మానం



సుభాష్‌నగర్: హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. పార్టీ బలోపేతం కోసం పని చేయాలని, కష్టపడే కార్యకర్తలను పార్టీ ప్రోత్సహిస్తుందని బండి సంజయ్ పేర్కొన్నారని తెలిపారు.

పదోన్నతి పొందిన టీచర్లకు..



నిజామాబాద్‌అర్బన్: ఇటీవల విద్యాశాఖలో పదోన్నతి పొందిన టీచర్లకు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. శనివారం నగరంలో టీఎన్‌జీవోస్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. సంఘం నాయకులు సుధాకర్, దేవసాయం, పోశన్న పాల్గొన్నారు.

పరువు తీసుకుంటున్న సొసైటీలు

- అధికారుల నిర్లక్ష్యం కారణంగా నష్టపోతున్న రైతులు
- మండల పరిధిలో పలువురికి వర్తించని రుణమాఫీ



ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కలిసిన రుణమాఫీ కాని గుండారం రైతులు(ఫైల్)



నగరంలోని కోటగల్లీ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం

నిజామాబాద్ రూరల్: రైతులకు వెన్నుదన్నుగా ఉండాల్సిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయి. 2018–19లో జిల్లా కేంద్రంలోని కోటగల్లీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో దాదాపు రూ.83 లక్షల అప్పట్లో పనిచేసిన సీఈవో శివరామ రాజు, క్యాషియర్ భాస్కర్ రైతులకు రుణం చెల్లించినట్లుగా సహకార సంఘం నకిలీ బిల్లులు ఇచ్చి రైతుల్ని నట్టేట ముంచారు. దీనికి సంబంధించి రైతులకు రావాల్సిన డబ్బులు ఇంకా రికవరీ కాకపోవడంతో అయోమయంలో ఉన్నారు. అదే విధంగా 2019–20లో పాల్దా సహకార సంఘం పరిధిలో అప్పట్లో పనిచేసిన సీఈవో సునీల్ రెడ్డి రైతులకు, పరపతి సంఘానికి దాదాపు రూ.79 లక్షలు ఎగనాయం పెట్టి చివరికి ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన సహకార సంఘం ఉన్నత అధికారులు రూ.70 లక్షలు రికవరీ చేసి రైతు ఖాతాల్లో జమచేశారు. మూడు రోజుల కిందట గుండారం సహకార సంఘం అధికారుల నిర్లక్ష్యం వల్ల దాదాపు 68 మంది అన్నదాతలకు రుణాలు మాఫీ కాలేదు. దీంతో వారు గుండారం సొసైటీ చైర్మన్ దాసరి శ్రీధర్ నేతృత్వంలో రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే రైతులకు న్యాయం చేస్తాం అని హామీ ఇచ్చారని చైర్మన్ శ్రీధర్ పేర్కొన్నారు.

రైతులకు తీవ్ర అన్యాయం

పరపతి సంఘాలలో పనిచేసే అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతోంది. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తే రైతులకు ఇబ్బంది ఉండదని రైతులు అంటున్నారు. అధికారులు చేసే చిన్న, చిన్న తప్పులకు ప్రజాప్రతినిధులు నిధులు సైతం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంటుంది. మండలంలో నాలుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా అందులో మూడు సంఘాల్లోని రైతులు ఇబ్బందులకు గురైన వారే ఉన్నారు. రూరల్ మండల పరిధిలో సహకార సంఘాల్లో ఇంత జరిగినా ఉన్నత అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.

“ అర్హులందరికీ రుణమాఫీ

గుండారం సహకార సంఘం పరిధిలో కొందరికి సాంకేతిక కారణాల వల్ల రుణాలు మాఫీ కాలేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. ఆగస్టు 15 తర్వాత అర్హులందరికి రుణమాఫీ జరుగుతుందని హామీ ఇచ్చారు. ప్రత్యేకంగా గుండారం సహకార సంఘం పరిధిలో 68 మంది అన్నదాతలకు రుణమాఫీ కాలేదు. దీనిపై కూడా ఎమ్మెల్యే, రైతులతో కలిసి మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. – దాసరి శ్రీధర్, గుండారం సొసైటీ చైర్మన్

నేటి చిత్రం..



మురుగు పారేనా.. చింత తీరేనా?

నగరంలో 100 ఫీట్ రోడ్డు నుంచి గాయత్రినగర్‌కు వెళ్లే దారిలో ఉన్న పులాంగ్ బ్రిడ్జి కాలువ గుర్రపుడెక్కతో నిండిపోయింది. చెత్తాచెదారం కూడా ఉండటం వల్ల మురికి నీరు ముందుకు కదలడం లేదు. స్థానికులతో పాటు వాహనదారులు దుర్వాసన భరించలేక పోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫోటోగ్రాఫర్ –నిజామాబాద్

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న తాడెం గ్రామస్తులు



ఎమ్మెల్యేతో దుబ్బాక వీడీసీ సభ్యులు

మోపాల్: తాడెం గ్రామాభివృద్ధితోపాటు రెడ్డి సంఘం కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేయాలని రెడ్డి సంఘం ప్రతినిధులు శనివారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. అనంతరం ప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామంలోనికి వచ్చే రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైందని, అలాగే గ్రామంలో అనేక సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. తాడెంను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దాలని, అందుకు గ్రామస్తులందరం సహకరిస్తామని ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సొసైటీ మాజీ చైర్మన్ కూచన్‌పల్లి సూర్యారెడ్డి, మాజీ సర్పంచులు అనంత్ రెడ్డి, నారాయణరెడ్డి, సంఘం ప్రతినిధులున్నారు.

దుబ్బాక సమస్యలపై వినతి

ధర్పల్లి: గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డిని దుబ్బాక గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. నూతనంగా ఎన్నికైన వీడీసీ సభ్యులు ఎమ్మెల్యేను శనివారం కలిసి గ్రామంలోని సమస్యలను వివరించారు. నల్లగుట్ట నర్సింహస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డును నిర్మించాలని, గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు నిధులు మంజూరు చేయించాలని కోరారు. వీడీసీ చైర్మన్ వినోద్, గోవర్ధన్‌రెడ్డి, ప్రేమ్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పోతన్న ఉన్నారు.

త్రయంబక్‌పేటను గ్రామ పంచాయతీగా మార్చాలి



ఎమ్మెల్యేతో త్రయంబక్‌పేటవాసులు

ఇందల్వాయి: ఇందల్వాయి మండలంలోని రంజిత్ నాయక్ తండా గ్రామ పరిధిలో ఉన్న త్రయంబక్ పేటను గ్రామ పంచాయతీగా మార్చాలంటూ త్రయంబక్‌పేట్‌వాసులు ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డిని రూరల్ క్యాంప్ కార్యాలయంలో శనివారం కలిసి విన్నవించారు. రంజిత్‌నాయక్ తండా వంద శాతం ఎస్టీ రిజర్వ్‌డ్‌గా ఉండటంతో బీసీలమైన తమకు రాజకీయ లబ్ధి చేకూరడం లేదని, దీంతో తాము అన్ని విధాలుగా వెనకబడుతున్నామని వారు ఎమ్మెల్యేకి తెలిపారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించి త్రయంబక్‌పేటవాసులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే అన్నారు.

‘క్రిమినల్ కేసులు నమోదు చేయాలి’



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

జక్రాన్‌పల్లి: అర్గుల్ గ్రామంలో రైతు కుంట రాజేష్ మృతికి కారణమైన వడ్డీ వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అర్గుల్‌లో రాజేష్ కుటుంబాన్ని సంఘం ఉమ్మడి ప్రతినిధులు పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. ఉమ్మడి కుటుంబం నుంచి వచ్చిన ఎకరం 20 గుంటల భూమిలో వచ్చే ఆదాయం సరిపోవడం లేదని రాజేశ్ 13 ఏళ్లు గల్ఫ్ దేశాలలో పని చేశాడన్నారు. అనంతరం గ్రామంలోనే 28 గుంటల భూమిని కొనుగోలు చేశాడని తెలిపారు. కానీ ధరణిలో ఇబ్బందుల వల్ల రాజేష్ పేరు మీద పట్టా మార్పిడి కాలేదన్నారు. తనకున్న వ్యవసాయ భూమిలో రెండు బోరుబావులు వేసినప్పటికి నీళ్లు రాలేదన్నారు. దీంతో అప్పుల భారం ఎక్కువయ్యాయని తెలిపారు.అప్పులు తీర్చడం కోసం ఇటుక బట్టీ వ్యాపారం చేసి నష్టపోయాడన్నారు. ఫైనాన్స్‌లో తీసుకున్న అప్పులకు ఈ నెల 18న డబ్బులు చెల్లించకపోతే బాగుండదని హెచ్చరించి వెళ్లారన్నారు. ఎలాంటి చట్టబద్ధత లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వడ్డీ వ్యాపారుల ఒత్తిడి మూలంగా రాజేష్ ఆత్మహత్యకు పూనుకున్నాడన్నారు. రైతు రాజేష్ మృతికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కుమారులు ఇద్దరికి హాస్టల్ వసతి కల్పించి విద్యనందించాలని కోరారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవరాం, జిల్లా అధ్యక్షుడు సురేష్, నాయకులు బాబన్న, గంగారాం, గంగాధర్, కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు గంగాధర్, దేవన్న, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు!

ఆర్మూర్‌టౌన్: రెండో శనివారం కూడా నిబంధనలు ఉల్లంఘిస్తూ తరగతులు నిర్వహిస్తున్న పలు ప్రయివేటు పాఠశాలల ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దగ్గరుండి స్కూళ్లను బంద్ చేయించారు. ఇందూర్ జిల్లా కన్వీనర్ దామ సునీల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విశ్రాంతి లేకుండా మానసికంగా ఒత్తిడి పెంచుతున్నారని అన్నారు. మరోసారి ప్రభుత్వ సెలవు రోజుల్లో పాఠశాలలు నడిపిస్తే ఆ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ‘జోస్ అలుక్కాస్’ 60వ వార్షికోత్సవం

- వినియోగదారుల అభిమానాన్ని చూరగొనడం అభినందనీయం
- నగర మేయర్ దండు నీతూ కిరణ్



జోస్ అలుక్కాస్ ప్రతినిధులతో మేయర్

నిజామాబాద్ రూరల్: జోస్ అలుక్కాస్ జువెలరీ షోరూం అధునాతన డిజైన్‌లో బంగారు, వజ్రాభరణాలను అందుబాటులో ఉంచుతూ వినియోగదారుల అభిమానాన్ని చూరగొనడం అభినందనీయమని నగర మేయర్ దండు నీతూ కిరణ్ అన్నారు. శనివారం జోస్ అలుక్కాస్ 60వ వార్షికోత్సవ వేడుకల ప్రారంభ కార్యక్రమం షోరూం ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నగర మేయర్ దండు నీతూ కిరణ్ కేక్ కట్ చేసి సంబురాలను ప్రారంభించారు. మేయర్ చేతుల మీదుగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆభరణాల వ్యాపారంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీమన్నారు. సీఎస్ఆర్ ఫండ్ ద్వారా పాఠశాలలకు డిజిటల్ పాఠాలు బోధించడానికి వీలుగా టీవీలు ఫర్నిచర్ అందజేశారని వివరించారు. ఆరు వారాల పాటు వినియోగదారులకు లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందజేయడానికి ఏర్పాట్లు చేశారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ధనీష్, ఫ్లోర్ మేనేజర్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని డీ–2 సెక్షన్ పరిధిలోగల 33/11 కేవీ తిలక్‌గార్డెన్ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ సివిల్ ఆస్పత్రి ఫీడర్‌లో ఏ, బీ స్విచ్ అమర్చడానికి ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని టౌన్–2 ఏడీఈ ఆపరేషన్స్ తోట రాజశేఖర్ శనివారం తెలిపారు. ఖలీల్‌వాడి, సరస్వతీనగర్, గాం. దీచౌక్, మార్వాడి గల్లీ, జవహర్ రోడ్డు, హతాయి గల్లీ, హెడ్ పోస్టాఫీస్, వన్ టౌన్ పోలీస్‌స్టేషన్, కుమార్‌గల్లీ, రాష్ట్రపతి రోడ్డు, దేవి రోడ్డు చౌరస్తా ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

వర్ని(చందూర్): కేరళ వరద బాధితుల కోసం చందూరు మండల కేంద్రంలో శనివారం సీఐటీయూ నాయకులు విరాళాలు సేకరించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విరాళాలు సేకరిస్తున్నామని కార్మిక నేత నన్నేసాబ్ తెలిపారు. ప్రకృతి విలయతాండవంలో వరదల్లో వందల మంది చిక్కుకొని కేరళ ప్రజలు మరణించడం బాధాకరమన్నారు. విరాళాలు ఇచ్చి, మానవతావాదులు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాయిబాబా, భూమయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,300	వెండి (కిలో)	85,000
22 క్యారెట్స్	66,692		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	25	50	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	45	60	దోసకాయ	20	40
దొండకాయ	30	50	ఆలుగడ్డ	35	50
బీర్నీసుకాయ	60	90	గోబిగడ్డ	25	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	50	75
వంకాయ	50	70	బీట్‌రూట్	35	60
పాలకూర	60	80	కరివేపాకు	50	70
మెంతికూర	60	80	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	80	110	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	70			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	కమిటీ కుర్రోళ్ళు (తెలుగు) - 10.50, 4.35, 7.40, 10.40 తుఫాన్(తెలుగు)- 1.50
స్క్రీన్-2	మురారి (తెలుగు) - 10.15 భవనమ్ (తెలుగు) - 1.35 కల్కి-2898 2డీ (తెలుగు) - 4.20 తుఫాన్ (తెలుగు) - 7.40 రాయన్ (తెలుగు) - 10.30
స్క్రీన్-3	మురారి-12.15, 3.40, 7.10, 10.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	డెడ్‌పూల్-3డీ(తెలుగు)-10.00,7.30 శివంభజే(తెలుగు)-1.00 కల్కి-2898 2డీ(తెలుగు)-3.45 మురారి(తెలుగు)-10.45
స్క్రీన్-2	కమిటీ కుర్రోళ్ళు(తెలుగు)- 1.00, 7.25,10.40 రాయన్(తెలుగు)- 4.15
స్క్రీన్-3	కేసు నెం.15(తెలుగు)- 11.30 పాగల్ బీఎస్ కాదల్(తెలుగు)-1.55 సింబ(తెలుగు)- 4.25 భవనమ్(తెలుగు)-7.10,10.10
స్క్రీన్-4	కమిటీ కుర్రోళ్ళు(తెలుగు)=11.40 సంఘర్షణ(తెలుగు)-2.55 ల్యాండ్ మాఫియా(తెలుగు)-5.20 తుఫాన్(తెలుగు)- 10.40
దేవి	కమిటీ కుర్రోళ్ళు (తెలుగు)- 11.15 2.15 -రాయన్ (తెలుగు)-6.15 9.15
నటరాజ్	భవనమ్- 11.00,2.00, 9.00 మురారి(తెలుగు)-6.00
విజయ్	మురారి(తెలుగు)-9.15 కల్కి-2898 2డీ -2.00,6.00,9.00

స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల శుద్ధి



సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహాన్ని శుద్ధి చేసిన నాయకులు



ఎల్‌బీ శాస్త్రి విగ్రహానికి నివాళులు

సుభాష్‌నగర్: నగరంలోని ఖిల్లా రాంమందిర్ మండలం, కంఠేశ్వర్ మండల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలు, పరిసరాలను శుభ్రం చేశారు. గాజుల్‌పేట్‌లోని వివేకానంద విగ్రహం, వర్ని చౌరస్తాలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం, లాల్ బహదూర్ శాస్త్రి, తదితరుల విగ్రహాలను శుభ్రం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు మాట్లాడుతూ.. బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు రాబోయేతరాలకు స్వాతంత్ర సమరయోధులు చేసిన త్యాగాలు, ప్రతి పౌరుడికి దేశంపై భక్తి, బాధ్యత, గౌరవం పెరగాలనే ఉద్దేశంతో కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ధనిక, పేద తేడా లేకుండా ఆగస్టు 15వ తేదీన ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. మండలాల అధ్యక్షులు పుట్ట వీరేందర్, రోషన్ లాల్ బోరా, ఓబీసీ మోర్చా నాయకులు కోడూరు నాగరాజు, సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు రాగి నారాయణ యాదవ్, సాయివర్ధన్, ఇల్లెందుల మమత ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మాజీ మంత్రికి ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు

నిజామాబాద్‌నాగారం: కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ జయంతి వేడుకలను తెలంగాణ మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ప్రగతినగర్ మున్నూరు కాపు కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షులు తోట రాజశేఖర్ మాట్లాడుతూ.. గవర్నర్‌గా, కేంద్ర మంత్రిగా ఉండి న్యాయ వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినటువంటి మహా వ్యక్తి అని , పేద ప్రజల అభివృద్ధి కోసం ఎన్నో కొత్త పథకాలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ అబ్బప్ప రవి, సలహాదారులు అబ్బాయి లింబాద్రి, చిట్టి నారాయణ రెడ్డి, జిల్లా మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి ఆకుల చిన్న రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నిజామాబాద్‌అర్బన్: యూఎస్ఎఫ్ఐ నిజామాబాద్ అర్బన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి పెద్ది సూరి తెలిపారు. అర్బన్ నియోజకవర్గం అధ్యక్షుడిగా గణేష్, కార్యదర్శులుగా మహేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ విద్యార్థి సమస్య లపై పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు.

అధ్వానంగా రహదారి



గుంతలమయంగా మారిన ముషీర్ నగర్ రోడ్డు

సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. తారు, కంకర తేలి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షానికి గుంతల్లో నీరు నిలవడంతో లోతు తెలియక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అలాగే గ్రామం నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే రోడ్డు, కొండాపూర్–సిరికొండ వైపు వెళ్లే రోడ్డు గుంతలతో అధ్వానంగా తయారవడంతో గ్రామస్తులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి కనీస గుంతలైనా పూడ్చాలని స్థానికులు కోరారు.



కొండాపూర్-సిరికొండ రోడ్డు